
సాక్షి
తూర్పుగోదావరి
శుక్రవారం । 7 । జూన్ । 2024



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం తూర్పు డెల్టాకు 600, మధ్య డెల్టాకు 1000, పశ్చిమ డెల్టాకు 3,000 క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు.



అల్లంత దూరాన ధర

గతంలో ఎన్నడూ లేనివిధంగా అల్లం ధర ఆకాశాన్నంటుతోంది. రైతుబజార్లలో కిలో రూ.186 ఉండగా, బహిరంగ మార్కెట్‌లో రూ.200 పైనే పలుకుతోంది. - 8లో▸

గరిష్టం/కనిష్టం
36.0°/24.5°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	35.0	27.0
కాకినాడ	34.0	24.5
అమలాపురం	36.0	26.0

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ శ్రేణులకు అండగా కమిటీ ఏర్పాటు

రాజమహేంద్రవరం సిటీ: ఎన్నికల తర్వాత టీడీపీ దాడులతో రాష్ట్రంలో అత్యంత భయానక పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రభుత్వం ఏర్పాటు కాకముందే టీడీపీ శ్రేణులు చెలరేగిపోతున్నాయి. ఈ సమయంలో వైఎస్సార్ సీపీ నాయకులకు, కార్యకర్తలకు తోడుగా నిలిచేందుకు 25 పార్లమెంటరీ నియోజకవర్గాలకు పార్టీ కమిటీలను నియమించారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు, అక్కచెల్లెమ్మలకు, అన్నదమ్ములకు, సోషల్ మీడియా సైనికులకు నూతనంగా ఏర్పాటు చేసిన ఈ కమిటీలు అండగా ఉంటాయి. బాధిత కుటుంబాలను పరామర్శించడమే కాకుండా, వారికి న్యాయ, వైద్య పరంగా, ఆర్థికంగా సహాయం అందిస్తాయి. రాజమండ్రి పార్లమెంటరీ స్థాయిలో ఏర్పాటైన కమిటీలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, మాజీ మంత్రులు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, తానేటి వనిత, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్, పార్టీ పార్లమెంటరీ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, తలారి వెంకట్రావు, గెడ్డం శ్రీనివాస నాయుడులను నియమించారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఎత్తివేత

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): సార్వత్రిక ఎన్నికల ప్రవర్తనా నియమావళిని గురువారం సాయంత్రం 5 గంటలతో ఎత్తివేసినట్టు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె.మాధవీలత తెలిపారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మార్చి 16న కేంద్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసింది. నాటి నుంచి అమల్లోకి వచ్చిన కోడ్ గురువారం సాయంత్రం వరకూ దాదాపు 83 రోజులు కొనసాగింది. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు ఆటంకం లేకుండా అందరూ సహకరించారని, ఆ స్ఫూర్తితో ముందుకు సాగాలని కలెక్టర్ కోరారు.

ఓటర్ల నోటాపాట

- కొందరు అభ్యర్థులకు పోలైన ఓట్ల కన్నా 'నోటా'యే అధికం
- ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో 19,438 నోటా ఓట్లు
- లోక్‌సభకు 24,435



రాజమహేంద్రవరం రూరల్: ఈ ఎన్నికల్లో పలువురు ఓటర్లు నన్ ఆఫ్ ది అబౌ(నోటా)కు ఓటు వేశారు. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులను కాకుండా తెలిసో, తెలియకో ఈవీఎంలపై నోటా బటన్ నొక్కారు. దీంతో రాజమండ్రి పార్లమెంటరీ పరిధిలో భారీగానే నోటా ఓట్లు కూడా పోలయ్యాయి. పోటీలో ఉన్న వైఎస్సార్ సీపీ, టీడీపీ, జనసేన, బీజేపీ మినహా ఇతర రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులకు పోలైన ఓట్ల కంటే నోటాకు పడిన ఓట్లే అధికం కావడం విశేషం.

2013 నుంచి..

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నచ్చకపోతే.. ఓటర్లు ఆ విషయాన్ని తెలియజేసేందుకు, వారి ఓటు మరొకరు వేయకుండా ఉండేందుకు కేంద్ర ఎన్నికల సంఘం 2013 నుంచి నోటాను ప్రవేశపెట్టింది. అభ్యర్థులు నచ్చక చాలా మంది ఓటు వేయడానికి ముందుకు రావడం లేదు. దీనివల్ల పోలింగ్ శాతం తగ్గుతోంది. ప్రజాస్వామ్యంలో కీలకమైన ఎన్నికల్లో ప్రతి ఓటరూ భాగస్వామి కావాలనే లక్ష్యం నెరవేరడం లేదు. ఈ నేపథ్యంలోనే ఎన్నికల సంఘం నోటాను అమలులోకి తెచ్చింది. అప్పటి నుంచీ అభ్యర్థులు, వారి గుర్తులతో పాటు నోటాకు కూడా ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్‌లలో చోటు కల్పించారు. అభ్యర్థులు ఇష్టం లేకున్నా ఓటర్లు పోలింగ్ బూత్‌కు వచ్చి నోటాకు ఓటు వేయడం ద్వారా పోలింగ్ శాతం పెరుగుతోంది.

నోటాకు ఓట్లు పడ్డాయిలా..

- జిల్లావ్యాప్తంగా నోటాకు ఈసారి ఎన్నికల్లో గతంకన్నా గణనీయంగా ఓట్లు పడ్డాయి. ఈవీఎంలు, సర్వీసు ఓట్లు, పోస్టల్ బ్యాలెట్‌లను పరిగణనలోకి తీసుకుంటే రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో 19,438 ఓట్లు నోటాకు పడ్డాయి. వీటికంటే పార్లమెంటరీ స్థానానికి నోటా ఓట్లు అధికంగా పోలవడం విశేషం. పార్లమెంటరీ స్థానానికి 24,435 మంది నోటాకు ఓటు వేశారు.
- రాజమండ్రి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో 12 మంది పోటీ చేశారు. వీరిలో నోటా కన్నా తక్కువ ఓట్లు వచ్చిన వారు తొమ్మిది మంది ఉండటం గమనార్హం. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ అభ్యర్థి గిడుగు రుద్రరాజు నోటా కంటే 8,073 ఓట్లు మాత్రమే అధికంగా తెచ్చుకున్నారు.
- రాజమండ్రి సిటీ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 10 మంది పోటీ చేశారు. వీరిలో టీడీపీ, వైఎస్సార్ సీపీ, కాంగ్రెస్ అభ్యర్థులు మినహా మిగిలిన ఏడుగురికి నోటా ఓట్లు 1,569 కంటే తక్కువే వచ్చాయి. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బోడా వెంకట్ మాత్రం నోటా కంటే అతి స్వల్పంగా 349 ఓట్లు అధికంగా పొందారు.
- రాజమండ్రి రూరల్‌లో ఏడుగురు అభ్యర్థులు బరిలో నిలిచారు. వీరిలో వైఎస్సార్ సీపీ, టీడీపీ, కాంగ్రెస్ మినహా మిగిలిన వారికి నోటా ఓట్లు 2,699 కంటే తక్కువ ఓట్లే వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి బాలేపల్లి మురళీధర్ మాత్రం నోటా కంటే 29 ఓట్ల అతి స్వల్ప ఆధిక్యత కనబరచగా.. మిగిలిన వారికి వెయ్యి లోపే ఓట్లు రావడం గమనార్హం.
- అనపర్తి నియోజకవర్గం నుంచి తొమ్మిది మంది అభ్యర్థులు పోటీ చేశారు. వీరిలో వైఎస్సార్ సీపీ, బీజేపీ మినహా మిగిలిన ఏడుగురు అభ్యర్థుల కంటే నోటాకే అధికంగా ఓట్లు పోలయ్యాయి. ఇక్కడ నోటాకు 3,093 మంది ఓటు వేశారు. కాంగ్రెస్ అభ్యర్థి యాళ్ల శ్రీనివాసరావుకు 1,276 ఓట్లు మాత్రమే పోలవడం గమనార్హం.
- రాజానగరం నుంచి 12 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. వీరిలో వైఎస్సార్ సీపీ, జనసేన అభ్యర్థులు మినహా మిగిలిన 10 మందికి నోటా ఓట్లు 2,975 కంటే తక్కువ ఓట్లే వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి ముండ్రు వెంకట శ్రీనివాస్‌కు కేవలం 1,901 ఓట్లు పోలయ్యాయి.
- కొవ్వూరు నియోజకవర్గంలో 11 మంది అభ్యర్థులు పోటీ చేశారు. వైఎస్సార్ సీపీ, టీడీపీ మినహా మిగిలిన తొమ్మిది మంది అభ్యర్థులకు నోటా ఓట్లు 2,465 కంటే అతి తక్కువ ఓట్లు పడ్డాయి. కాంగ్రెస్ అభ్యర్థి అరిగెల అరుణకుమారికి 1,897 ఓట్లు మాత్రమే వచ్చాయి.
- నిడదవోలు నుంచి 12 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. వైఎస్సార్ సీపీ, జనసేన మినహా మిగిలిన 10 మంది అభ్యర్థులకు నోటా ఓట్లు 2,137 కంటే తక్కువగా పడటం గమనార్హం.
- గోపాలపురం నియోజకవర్గంలో 10 మంది అభ్యర్థులు పోటీ చేశారు. వైఎస్సార్ సీపీ, టీడీపీ మినహా మిగిలిన ఎనిమిది మంది అభ్యర్థులకు నోటా ఓట్లు 4,500 కంటే తక్కువగా వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి మార్టిన్ లూథర్‌కు 2,387 ఓట్లు మాత్రమే వచ్చాయి.

నోటా ఓట్ల వివరాలు

రాజమండ్రి లోక్‌సభ	24,435
అసెంబ్లీ స్థానాలు	
గోపాలపురం	4,500
రాజమండ్రి రూరల్	2,699
రాజమండ్రి సిటీ	1,569
అనపర్తి	3,093
రాజానగరం	2,975
కొవ్వూరు	2,465
నిడదవోలు	2,137

ఆనందమానందమాయె..



దేవరపల్లి వేలం కేంద్రానికి అమ్మకానికి వచ్చిన పొగాకు బేళ్లు

- నిలకడగా వర్జీనియా పొగాకు మార్కెట్
- కిలో గరిష్ట ధర రూ.332
- సగటు రూ.298.64
- కనిష్టం రూ.235

దేవరపల్లి: పొగాకు రైతుల ఆనందానికి అవధుల్లేవు. మార్కెట్లో పొగాకు ధరలు ఊహకు అందని రీతిలో పెరగడంతో వారు ఉత్సాహంగా ఉన్నారు. గతంలో కొంత కాలం గిట్టుబాటు ధర రాక తీవ్రంగా నష్టపోయారు. చిన్నచిన్న రైతులు సాగుకు దూరమయ్యారు. పొగాకుకు ప్రత్యామ్నాయంగా ఉద్యాన పంటల వైపు వెళ్లారు. పదేళ్ల క్రితం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని మెట్ట ప్రాంతంలో పొగాకు సాగు లక్ష ఎకరాల్లో జరిగేది. ధర గిట్టుబాటు కాకపోవడంతో ఈ పంట విస్తీర్ణం క్రమేపీ తగ్గుతూ వచ్చింది. రెండేళ్ల క్రితం 40 వేల ఎకరాల్లో సాగు జరిగేది. అనంతరం మార్కెట్లో పొగాకుకు గిట్టుబాటు ధర పలకడంతో రైతులు ఉద్యాన పంటల సాగు తగ్గించి, మళ్లీ పొగాకు సాగు వైపు మొగ్గు చూపారు. దీంతో ప్రస్తుతం పొగాకు విస్తీర్ణం సుమారు 80 వేల ఎకరాలకు చేరింది. సాగు విస్తీర్ణం పెరగడంతో దాదాపు 67 మిలియన్ల కిలోల ఉత్పత్తి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. 2023–24 సీజన్‌లో సాగు చేసిన పొగాకు విక్రయాలు మార్చి 6వ తేదీ నుంచి జరుగుతున్నాయి.

23.33 మిలియన్ల కిలోల కొనుగోలు

మన జిల్లాతో పాటు ఏలూరు జిల్లాలోని ఐదు వేలం కేంద్రాల్లో ఈ ఏడాది ఇప్పటి వరకూ 23.33 మిలియన్ల కిలోల పొగాకును వ్యాపారులు కొనుగోలు చేశారు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకూ మొత్తం 69 రోజుల పాటు వేలం నిర్వహించారు. అధికారుల అంచనా ప్రకారం రైతుల వద్ద మరో 45 మిలియన్ల కిలోల పొగాకు అమ్మకానికి ఉంది. మార్కెట్లో వర్జీనియా పొగాకుకు డిమాండ్ ఏర్పడడం, వేలం కేంద్రాల్లో ఊహించని ధరలు పలకడంతో ముందు ముందు ఇంకా మంచి ధర లభిస్తుందని రైతులు ఆశిస్తున్నారు. దీంతో వేలం కేంద్రాలకు బేళ్లను పూర్తి స్థాయిలో తీసుకుని రావడం లేదు. ప్రతి రోజూ ఒక్కో వేలం కేంద్రంలో 1,200 నుంచి 1,400 బేళ్లు అమ్ముడుపోవాల్సి ఉండగా, ప్రస్తుతం 500 నుంచి 900 బేళ్లు వేలానికి వస్తున్నాయని అధికారులు తెలిపారు.

మందగించిన లో గ్రేడ్ పొగాకు

ప్రస్తుతం లో గ్రేడ్ పొగాకు విక్రయాలు పూర్తిగా మందగించాయి. దాదాపు నెల రోజుల నుంచి వేలం కేంద్రాల్లో లో గ్రేడ్ పొగాకు కొనుగోళ్లు జరగడం లేదు. బ్రైట్ గ్రేడ్ పొగాకు విక్రయాలు జోరుగా జరుగుతున్నాయి. ప్రస్తుతం లో గ్రేడ్ కొనుగోలుకు కంపెనీలు ముందుకు రావడం లేదని అధికారులు అంటున్నారు. మార్కెట్లో అమ్ముడుపోతున్న గ్రేడ్ పొగాకునే వేలం కేంద్రాలకు తీసుకుని రావాలని రైతులకు అధికారులు సూచిస్తున్నారు.

రూ.696 కోట్ల విక్రయాలు

పొగాకు బోర్డు రాజమహేంద్రవరం రీజినల్ కార్యాలయం పరిధిలోని ఐదు వేలం కేంద్రాల్లో ఇప్పటి వరకూ రూ.696 కోట్ల విలువైన 23.33 మిలియన్ల కిలోల పొగాకు విక్రయాలు జరిగాయని అధికారులు తెలిపారు. ప్రస్తుతం కిలో గరిష్ట ధర రూ.332, కనిష్ట ధర రూ.235. సగటు ధర రూ.298.64 పలుకుతుంది. ఈ ధర పట్ల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ ఏడాది మార్కెట్ ప్రభావం వచ్చే ఏడాది పంట సాగుపై ఎక్కువగా పడుతుందని వారు అంటున్నారు. ఇప్పటికే భూముల కౌలు, బ్యారన్ల అద్దె రెట్టింపు పలుకుతున్నాయని, దీంతో పాటు కూలి రేట్లు, ఎరువుల ధరలు కూడా పెరుగుతాయని ఆందోళన చెందుతున్నారు.

మార్కెట్ ఆశాజనకం



పొగాకు మార్కెట్ ఆశాజనకంగా ఉంది. ధర నిలకడగా కొనసాగుతోంది. ఈ ఏడాది రైతుల ఊహకు అందని రీతిలో ధరలు పలుకుతున్నాయి. ఈ ధర పట్ల వారు ఆనందంగా ఉన్నారు. పొగాకు బోర్డు సూచించిన మేరకు పంట వేస్తే మంచి లాభాలు పొందవచ్చు. ఈ ఏడాది మార్కెట్ ప్రభావం వచ్చే ఏడాది సాగుపై పడుతుంది. పెట్టుబడులు, ఉత్పత్తి ఖర్చులు, భూముల కౌలు, బ్యారన్ల అద్దెలు రెట్టింపు పలుకుతున్నాయి. దిగుబడులు తగ్గినా మార్కెట్లో ధర బాగుండటం వల్ల సాగు లాభసాటిగా ఉంది.

– సత్తి జగదీశ్వరరెడ్డి, రైతు, కృష్ణంపాలెం

నిలకడగా ధరలు



పొగాకు ధరలు మార్కెట్లో నిలకడగా కొనసాగుతున్నాయి. రెండు వారాలుగా పెద్దగా మార్పు లేదు. బేళ్ల సంఖ్య పెరగాల్సి ఉంది. మొన్నటి వరకూ ఎన్నికల సమయం కావడం వల్ల రైతులు వేలం కేంద్రాలకు తక్కువ బేళ్లు తీసుకుని వచ్చారు. వచ్చే వారం నుంచి బేళ్ల సంఖ్య పెరుగుతుంది. అంతర్జాతీయంగా పొగాకు కొరత ఎక్కువగా ఉండటం వల్ల మన పొగాకుకు డిమాండ్ ఏర్పడింది. అమ్ముడు పోతున్న గ్రేడ్ పొగాకునే రైతులు వేలం కేంద్రాలకు తీసుకుని వెళ్లాలి. లో గ్రేడ్ పొగాకు కొనుగోలుకు కొంత సమయం పడుతుంది.

– ఎం.ఆదిశేషయ్య, రీజినల్ మేనేజర్, పొగాకు బోర్డు, రాజమహేంద్రవరం

వేలం కేంద్రాల వారీగా పొగాకు విక్రయాలు

వేలం కేంద్రం	విక్రయాలు (కిలోలు)	గరిష్ట ధర (కిలోకు రూ.)	కనిష్ట ధర (కిలో రూ.)	సగటు ధర (కిలో రూ.)
దేవరపల్లి	36,71,520	332	245	318.02
గోపాలపురం	45,39,800	332	235	302.38
జంగారెడ్డిగూడెం–1	52,01,389	331	240	294.15
జంగారెడ్డిగూడెం–2	51,23,044	333	235	297.31
కొయ్యలగూడెం	47,97,173	331	235	296.28

కొత్త బంగారు లోకం

- ఇంటర్‌లో కౌమార దశ
- గాడి తప్పితే జీవితమే గందరగోళం
- చెడు వ్యసనాలను దరి చేర నీయకూడదు
- క్రమశిక్షణతో సాగితే విజయం ఖాయం



రాయవరం: కలలు..ఆశలు..ఆనంద సమయాలు.. హర్షయ్యే సందర్భాలు..పాఠాలు..డుమ్మాలు..అన్నీ కొత్తగా అన్పించేవే. అప్పటి వరకు పాఠశాల చదువు.. ఒక్కసారిగా కళాశాల వాతావరణం..ఇంటర్ విద్యార్థులకు ఇదో కొత్త అనుభవం. ఈ క్రమంతో కొత్త కొత్త పరిసరాలు..కొత్త వారితో పరిచయాలు, సరికొత్తగా అన్పించే ఆలోచనలు.. ఇప్పుడిప్పుడే కళాశాలలో అడుగుపెట్టే విద్యార్థికి ఇలా అన్నీ కొత్తగా, వింతగా అన్పిస్తాయి. టీనేజ్‌లో ఇంటర్మీడియెట్ దశ అత్యంత కీలకం . అంతేకాదు జీవితాన్ని మలుపు తిప్పాలన్నా ఇదే ముఖ్యమైన కాలం. అన్నీ తెలిసినట్టే అన్పిస్తుంది. కానీ ఏమీ తెలియని తనం ఆవహిస్తుంది. ఈ రెండింటి మధ్య తేడాను తెలుసుకుంటే జీవితం విజయం తలుపు తడుతుంది. ఏ మాత్రం తొందరపాటు నిర్ణయాలు తీసుకున్నా..జీవితం మళ్లీ మన చేతుల్లోకి రానంత వెనక్కి వెళ్తుంది. పరాజయం బాటలో నడుస్తుంది. అందుకే ఇప్పుడిప్పుడే జూనియర్ కళాశాలల్లో చేరుతున్న వారు జాగ్రత్తలు పాటిస్తూ ముందుకు సాగితే ఇంటర్ దశ నిజంగా కొత్త బంగారులోకం అవుతుంది. భవిష్యత్తును బంగారం చేస్తుంది.

అందుకే జాగ్రత్త పడాలి..

తొలిసారి ఎదుర్కొన్న పబ్లిక్ పరీక్షల్లో విజయం సాధించామన్న ఆత్మవిశ్వాసం, పాఠశాలను దాటి కళాశాలను చేరామన్న ఉత్సాహం..కొత్త పరిచయాలు, కళాశాల వాతావరణం కల్గించే ఆనందం వెరసి విద్యార్థులకు ఇంటర్మీడియెట్ దశ ఓ కొత్త బంగారు లోకమే. అనువైన గ్రూపు..ఇష్టమైన సబ్జెక్టులు చదివే తొలి స్వేచ్ఛా దశ ఇదని చెప్పవచ్చు. జీవితంలో కీలక అడుగులన్నీ ఇంటర్‌లోనే పడతాయనడంలో అతిశయోక్తి లేదు. ఉన్నత ప్రమాణాలతో ఉత్తమ ఫలితాలు సాధించినా, గాడి తప్పి అధఃపాతాళానికి పడిపోయినా అందుకు ఇంటర్‌లోనే బీజాలు పడతాయని చెప్పుకోవచ్చు. హైస్కూల్ విద్యతో మొదలయ్యే కౌమార ప్రాయం ఇంటర్‌లో మరింత పురి విప్పుతుంది. అందుకే జాగ్రత్త పడాలి.

చదువుకే తొలి ప్రాధాన్యం

ఇంటర్‌లో విద్యార్థులు ఎన్నో అంశాలకు ఆకర్షితులవుతారు. అయితే ఈ దశలో అందరికీ తొలి ప్రాధాన్యం చదువే కావాలి. తన జీవితంలో అల్లరి పాలయ్యేలా అల్లరి ఉండకూడదు. సినిమాల్లో చూపించినట్లుగా కాలేజీ ఎగ్గొట్టడం హీరోయిజం కాదనే విషయాన్ని తప్పనిసరిగా తెలుసుకోవాలి. విధిగా తరగతులకు హాజరు కావడం, పాఠ్యాంశాలపై దృష్టి పెట్టడం, అధ్యాపకులిచ్చే నోట్స్‌ను ఎప్పటికప్పుడు నీట్‌గా రాసుకోవడం, పోటీ పరీక్షలకు అనుగుణమైన ప్రణాళిక రూపొందించుకోవడం, స్నేహితులతో కలిసి కంబైన్డ్ స్టడీ చేయడం వంటివి అత్యంత కీలకం. ఎంతో ఉపయుక్తం.

సమయం విలువైనది

ఇంటర్‌లో సెలవు దినాలంటే విద్యార్థులకు పండగే. అయితే వాటిని సద్వినియోగం చేసుకోగలిగితే విద్యార్థి ఎన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించగలడు. ఆయా సమయాల్లో వారు ఎంచుకునే వ్యాపకాలే భవిష్యత్‌ను నిర్దేశిస్తాయి. మనసును, శరీరాన్ని ఉల్లాసపరిచే మంచి క్రీడలు, లైబ్రరీలో పుస్తక పఠనం, స్నేహితులతో సబ్జెక్టులపై చర్చ, శ్రుతిమించని వినోదం వంటివి ఆహ్లాదంతో పాటు జీవితాన్ని ఆనందమయం చేస్తాయి.

ఇలలో కలల జీవితం..

సివిల్స్, ఇంజినీరింగ్, మెడిసిన్, సాఫ్ట్‌వేర్ వంటి ఏ కోర్సుకైనా తొలి అడుగు పడాల్సింది ఇంటర్‌లోనే. అప్పటి వరకు తల్లిదండ్రుల చాటు బిడ్డలుగా ఉన్న పిల్లలు ఒక్కసారిగా స్వేచ్ఛా ప్రపంచంలోకి వస్తారు. కొత్త కొత్త స్నేహదనంతో నిండి కళాశాల జీవితం సక్రమంగా సాగితే ఒక బంగారు లోకమవుతుంది. తప్పటడుగులు వేస్తే కోలుకోలేని దెబ్బ తగులుతుంది. క్రమశిక్షణతోనే సాగితే కలల్లోని ఉన్న జీవితం ఇలలో సాధ్యమవుతుంది.

స్నేహమెంత మధురం

ఇంటర్‌లో చేరగానే విద్యార్థులను ప్రభావితం చేసే తొలి అంశం స్నేహం. అదృష్టం కొద్దీ అది ఉన్నత భావాలున్న వారితో కుదిరితే జీవితం ప్రభావితం అవుతుంది. లేదంటే ప్రమాదంలో పడుతుంది. పశ్చాత్తాపం పడేలా చేస్తుంది. చదువుపై ఇష్టం, పెద్దలపై గౌరవం, సమాజం మీద అవగాహన, అధ్యాపకులపై సదభిప్రాయం ఉన్న వారితో స్నేహం చేయాలి. అలాంటి దృక్పథంలోనే ముందుకు సాగాలి.

వ్యసనాలకు దూరం

జీవితాన్ని ప్రభావితం చేసే ప్రమాదకరమైన వ్యసనాలు ఈ దశలోనే అలవాటయ్యే అవకాశాలు ఉన్నాయి. వాటి నుంచి తప్పించుకోవాలి. 'సిగరెట్, గుట్కాలు, మద్యం వంటి వాటికి ఎంత దూరంగా ఉంటే అంత మేలు. అలాంటి వాటికి బీజాలు నాటే ఇంటర్‌లోనే విద్యార్థులు దృఢ సంకల్పంతో ఉండాలి. 'సెల్‌ఫోన్ వైరస్ విద్యార్థుల ప్రగతికి అవరోధంగా మారుతుంది. తరగతి గదుల్లో..చదువుకునే వేళల్లో అనవసరమైన కబుర్లకు అలవాటు పడేలా చేస్తాయి. పరిచిత, అపరిచిత వ్యక్తులతో చాటింగ్ మోజులో పడొద్దు. నెట్ అలవాటు విషయంలోను విద్యార్థులకు జాగ్రత్త అవసరం. అశ్లీలత వైపు మనసు మళ్లితే అంతే సంగతులు. పార్టీలు, వేడుకల పేరుతో స్నేహితులు చెడుదారుల వైపు ప్రేరేపించే అవకాశం ఉంటుంది. జాగ్రత్తగా ఉండాలి. సినిమాల ప్రభావంతో, స్నేహితుల ప్రోత్సాహంతో ప్రేమాయణమంటూ మనసు కలుషితం చేసుకోవద్దు. దారి తప్పి భావి జీవితాన్ని నాశనం చేసుకోవద్దు. స్నేహితులే లోకంగా అన్పించే వయస్సులో వారికి అతి ప్రాధాన్యం ఇస్తూ తల్లితండ్రుల, అధ్యాపకులను నిర్లక్ష్యం చేయకూడదు. తల్లితండ్రులు ఇచ్చే స్వేచ్ఛను దుర్వినియోగం చేయవద్దు.


తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి



పదవ తరగతి వరకు చదివిన వారు ఇంటర్‌కు రాగానే ఏదో తెలియని లోకంలో విహరిస్తారు. స్వేచ్ఛాజీవిగా భావిస్తారు. అప్పుడే వారి ఆలోచనలో పరిపరి విధాల మార్పులు సంభవిస్తాయి. ముఖ్యంగా చెడు అలవాట్లకు తొందరగా దగ్గరయ్యే అవకాశం ఉంటుంది. కుటుంబ సభ్యులు మార్పులను గమనించి మంచి చెడులను వివరించాలి. విద్యార్థి ఏ విధంగా చదువుతున్నాడు. ఏయే పరిసరాల్లో ఫ్రెండ్స్ ఉంటున్నారో గమనిస్తుండాలి. చెడు వ్యసనాలకు గురికాకుండా తల్లితండ్రులు, అధ్యాపకులు శ్రద్ధ వహించాలి. కళాశాల విద్యాభ్యాసం ఎంతో విలువైందనే విషయాన్ని గ్రహిస్తే జీవితం బాగుంటుంది.

– డాక్టర్ సౌమ్య పసుపులేటి, సైకియాట్రిస్ట్, ఏరియా ఆస్పత్రి, అమలాపురం

మితిమీరిన విశ్వాసం తగదు



పదవ తరగతి తర్వాత కొత్త ప్రపంచంలోకి అడుగు పెడతారు. చదువును పక్కన పెట్టి ప్రేమ, సినిమాలు, షికార్లు, స్నేహం వైపు దృష్టి మరలుతుంది. దీంతో భవిష్యత్తు నాశనం అయ్యే అవకాశాలున్నాయి. తల్లిదండ్రుల పర్యవేక్షణ అవసరం. అంతా తమకే తెలుసనే భావనతో విద్యార్థులు అతి విశ్వాసానికి పోతుంటారు. దీన్ని తల్లిదండ్రులు కనిపెడుతూ, అవసరమైనప్పుడు వారికి మంచి నడవడకను అలవర్చాలి.

– కొల్లాటి ప్రమీల, సోషల్ వర్కర్ ఇన్ టుబాకో కంట్రోల్ ప్రోగ్రామ్, ఏరియా ఆస్పత్రి, అమలాపురం.

కలలను సాకారం చేసుకోవాలి



దివంగత రాష్ట్రపతి అబ్దుల్ కలాం చెప్పినట్లు..కలలు కనాలి..వాటిని సాకారం చేసుకోవాలి. ఇందుకు విద్యార్థులు పట్టుదలతో కృషి చేయాలి. అప్పుడే ఏదైనా సాధించుకోవచ్చు. మొదట చదవడం కష్టంగా ఉంటుంది. ఆ తర్వాత అలవాటు చేసుకుంటే పుస్తకాలతో కుస్తీ పట్టడం సులువే. తల్లితండ్రులు ఇచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తే భవిష్యత్తు చేజారుతుంది.

– వనుము సోమశేఖరరావు, ఇంటర్మీడియెట్ బోర్డ్ విద్యాశాఖాధికారి, అమలాపురం

ప్రశాంతంగా ఎన్నికల ప్రక్రియ

- ఫలితాల ప్రకటనలో మనమే ఫస్ట్
- కలెక్టర్ మాధవీలత



కలెక్టర్ మాధవీలతను అభినందిస్తున్న జేసీ తేజ్‌భరత్ తదితరులు

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగిందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె.మాధవీలత అన్నారు. దీనికి సహకరించిన అధికారులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికలు విజయవంతంగా పూర్తయిన నేపథ్యంలో రిటర్నింగ్ అధికారులు, జిల్లా అధికారులతో కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎన్నికల కోడ్ ప్రారంభమైన మార్చి 16 నుంచి ఈ విధుల్లో పాలు పంచుకున్న రిటర్నింగ్ అధికారులు (ఆర్‌ఓ), నోడల్ అధికారులు, సిబ్బంది పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించారని అభినందించారు. ఎప్పటికప్పుడు ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలు కచ్చితంగా పాటించారన్నారు. ఎన్నికల పరిశీలకులకు కృతజ్ఞతలు తెలిపారు. పోలింగ్, కౌంటింగ్ సమయంలో జిల్లా యంత్రాంగం, పోలీసులు ఎటువంటి అవాంఛనీయ ఘటనలూ తలెత్తకుండా చాకచక్యంగా విధులు నిర్వహించారని అన్నారు. జిల్లా ఎస్పీ పి.జగదీష్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, కేంద్ర బలగాల సేవలను ప్రశంసించారు. రాష్ట్రంలోనే తొలి ఎన్నికల ఫలితం వెలువరించిన రాజమండ్రి రూరల్ అసెంబ్లీ నియోజకవర్గ ఆర్‌ఓ, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్‌ను, ఆయన బృందాన్ని కలెక్టర్ ప్రశంసించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ఫలితాలు ప్రకటనలో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని చెప్పారు. ఇది సమష్టి కృషికి నిదర్శనమని మాధవీలత అన్నారు. ఎన్నికల నిర్వహణలో ముందుండి, జిల్లా యంత్రాంగాన్ని సమర్థవంతంగా నడిపించిన కలెక్టర్ మాధవీలతను అధికారులు అభినందించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్, కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, డీఆర్‌ఓ జి.నరసింహులు, ఆర్‌ఓలు ఎ.చైత్రవర్షిణి, కేఎల్ శివజ్యోతి, ఆర్‌వీ రమణ నాయక్, ఎం.మాధురి, జిల్లా అధికారులు, సహాయ ఆర్‌ఓలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బంగారం చోరీపై కేసు

మామిడికుదురు: తలుపులు దగ్గరకు వేసి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో ప్రవేశించి బీరువాలోని బంగారు వస్తువులు చోరీ చేసిన ఘటనపై కేసు నమోదు చేశామని నగరం ఎస్సై పి.సురేష్ గురువారం తెలిపారు. మగటపల్లి గ్రామానికి చెందిన ఉద్దగిరి నాగశ్రీరామమూర్తి ఇంట్లో ఈ నెల 4వ తేదీ రాత్రి చోరీ జరిగిందన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో ప్రవేశించిన బీరువా పక్కన పెట్టిన తాళాలతో బీరువా తెరచి దానిలోని అయిదు కాసుల బంగారు నల్లపూసలు, రెండు ఉంగరాలు, బ్రాస్లెట్, ఆంజనేయస్వామి బిళ్ల, రూపులు చోరీ చేశారని బాధితుడు శ్రీరామమూర్తి ఫిర్యాదు చేశారన్నారు. ఆ వస్తువుల విలువ రూ.లక్ష ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారని ఎస్సై సురేష్ తెలిపారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

ముమ్మిడివరం: ఎన్నికలలో తమ అభ్యర్థికి అనుకూలంగా ఓటు వేయలేదనే అక్కసుతో ఒక వ్యక్తి తనపై దాడి చేసి గాయ పరిచాడని మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముమ్మిడివరం పోలీసులు ఎస్సీ ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ముమ్మిడివరం మండలం చినకొత్తలంక గ్రామానికి చెందిన నక్కా మావుళ్లమ్మ ఇళ్లలో పనిచేసుకుని జీవనం సాగిస్తుంది. ఇటీవల జరిగిన ఎన్నికలలో అదే గ్రామానికి చెందిన పొత్తూరి సుబ్బరాజు ఈ నెల నాలుగో తేదిన మావుళ్లమ్మ పనికోసం వెళుతుండగా అడ్డగించి మా పార్టీకి నీవు ఓటు వేయమంటే వేయలేదని అయినా మేము విజయం సాధించాం అంటూ దుర్భాషలాడుతూ తనపై భౌతిక దాడికి దిగి, ఆ సమయంలో టీడీపీ విజయోత్సవ ర్యాలీగా వెలుతున్న ట్రాక్టర్ కిందకు నెట్టి వేశాడని మావుళ్లమ్మ ఫిర్యాదులో పేర్కొంది. తాను గాయ పడగా తన కుమారుడు బాలకృష్ణ ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తీసుకు వెళ్లి వైద్యం చేయించాడని ఆమె తెలిపింది. తనపై దాడికి దిగి గాయపరిచి కులంపేరుతో దూషించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి, తనకు న్యాయం చేయాలని ఆమె పేర్కొంది. ఈ మేరకు ముమ్మిడివరం ఎస్సై డి.సురేష్‌బాబు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అల్లంత దూరాన ధర

- గత కొన్ని నెలలుగా పెరుగుతున్న రేటు
- ప్రస్తుతం రైతుబజార్‌లో కిలో అల్లం రూ.186
- బయట మార్కెట్‌లో రూ. 200పైమాటే
- కోల్‌కతా, మహారాష్ట్ర నుంచి దిగుమతి

బోట్‌క్లబ్: కూర ఏది వండాలన్నా అల్లం తప్పనిసరి. అలాంటి అల్లం కొనుగోలు చేయాలంటే ప్రస్తుతం భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుతం అల్లం ధర ఆకాశన్నంటుతోంది. ప్రస్తుతం రైతుబజార్‌లో కిలో అల్లం రూ.186 అమ్ముతుండగా బయట మార్కెట్‌లో కిలో అల్లం రూ.200 పైమాట ఉంది. దీంతో అల్లం కొనుగోలు చేయాలంటే ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది. గత కొన్ని నెలలుగా అల్లం ధర రోజురోజుకు పెరుగుతూనే వస్తుంది. మన జిల్లాలో అల్లం సాగు లేకపోవడంతో ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి అయ్యే అల్లంపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది. హోల్‌సేల్ వ్యాపారులు దగ్గర నుంచి కొనుగోలు చేసుకొని రైతు బజార్‌లతోపాటు, ఇతర ప్రాంతాల్లో అల్లం విక్రయిస్తున్నారు.



కూరగాయల దుకాణంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న అల్లం

మహారాష్ట్ర , కోల్‌కతా నుంచి ప్రతీ రోజు 30 టన్నులకు పైగా అల్లం కాకినాడకు దిగుమతి అవుతుంది. కాకినాడలోని గాంధీనగర్, ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద రైతుబజార్‌లో ప్రతీ రోజు మూడు నుంచి నాలుగు టన్నుల అల్లం విక్రయాలు జరుగుతాయి.

ఒడిశా నుంచి దిగుమతి లేక...

ప్రతీ రోజు జిల్లాకు వచ్చే అల్లంలో ఒడిశా నుంచి **అధికంగా దిగుమతి అయ్యేది. గత నెలలో వర్షాల కారణంగా అక్కడి నుంచి అసలు అల్లం దిగుమతి లేదు. ఒడిశా నుంచి దిగుమతి లేకపోవడంతో మహారాష్ట్ర, కోల్‌కతా నుంచి మాత్రమే జిల్లాకు** అల్లం దిగుమతి కావడంతో హోల్‌సేల్‌గా అల్లం ధరలు రోజురోజుకి పెరుగుతున్నాయి. మన జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో పండే ముక్క అల్లం కూడా ప్రస్తుతం అందుబాటులో లేకపోవడంతో అల్లం రేటు ఆకాశమే హద్దుగా రోజురోజుకీ పెరుగుతోంది. నగరవాసుల అవసరాలకు తగ్గ అల్లం దిగుమతి అయ్యే వరకూ ఈ పరిస్థితి తప్పదని హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు.

నెల వరకూ ఇదే పరిస్థితి

ఒడిశా నుంచి అల్లం దిగుమతి అయితే తప్ప రేట్లు తగ్గే పరిస్థితి లేదు. మరో నెల రోజుల వరకూ ఒడిశా నుంచి అల్లం దిగుమతి అయ్యే పరిస్థితులు లేవని వ్యాపార వర్గాలు తెలిపాయి. ఒడిశా నుంచి ప్రతీ రోజు గతంలో 15 నుంచి 20 టన్నుల అల్లం దిగుమతి అయ్యేది. మహారాష్ట్ర, కోల్‌కతా నుంచి 10 నుంచి 15 టన్నులు దిగుమతి చేసుకొనేవారు. కానీ ప్రస్తుతం ఒడిశా నుంచి దిగుమతి లేక పూర్తిగా మహారాష్ట్ర, కోల్‌కతా నుంచి వచ్చే అల్లంపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది. అందుకే రేట్లు కూడా తగ్గే పరిస్థితి లేదు.

ఇబ్బంది పడుతున్నాం



హోల్‌సేల్ వ్యాపారులు తరచూ రేటు పెంచడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. రైతు బజార్‌కు వచ్చే కొనుగోలు దారులు అల్లం ధర చూసి హడలిపోతున్నారు. గతంలో రూ.10కు అల్లం ఇచ్చే వాళ్లం. ప్రస్తుతం 100 గ్రాముల అల్లం రూ.19 కావడంతో కొనుగోలుదారులు అల్లం కొనాలంటే ఆలోచిస్తున్నారు. దీంతో వ్యాపారం కూడా సాగడం లేదు.

– ప్రగడ కృష్ణ, అల్లం వ్యాపారి గాంధీనగర్ రైతుబజార్

హోటల్ యజమానులకు తప్పని అవస్థలు

నిత్యం టిఫిన్లు, భోజనాలు విక్రయించే హోటల్స్‌తోపాటు మాంసాహారం విక్రయించే హోటల్స్ యజమానులకు రోజురోజుకీ పెరుగుతున్న అల్లం రేట్లు తగ్గకపోవడంతో దాని కోసం ఎక్కువ ఖర్చు చేయాల్సి వస్తోందని లబోదిబోమంటున్నారు. అల్లంరేట్లు పెరగడంతో టిఫిన్లు విక్రయించే హోటల్స్‌లో అల్లం పచ్చడి ఉండడం లేదు. అల్లం రేట్లు తగ్గితే తప్ప అల్లం పచ్చడి చేసే పరిస్థితులు కనిపించడం లేదని పెద్ద హోటల్స్ యజమానులు చెబుతున్నారు.

తాటాకిల్లు దగ్ధం



ఆలమూరులో దగ్ధమవుతున్న తాటాకిల్లు

ఆలమూరు: మండల కేంద్రమైన ఆలమూరులో గురువారం రాత్రి తాటాకిల్లు దగ్ధమైంది. స్థానికుల కథనం ప్రకారం శెట్టిబలిజ రామాలయం సమీపంలో నివాసముంటున్న మట్టా సత్తియ్యకు చెందిన తాటాకింట్లో హఠాత్తుగా మంటలు వ్యాప్తి చెందాయి. స్థానికులు అప్రమత్తమయ్యే లోపే పూరి గుడిసె పూర్తిగా దగ్ధమైంది. మండపేట నుంచి అగ్నిమాపక దళ వాహనం సంఘటనా స్థలానికి చేరుకున్నా ఫలితం లేకుండా పోయింది. ఆస్తినష్టం సుమారు రూ.రెండు లక్షల వరకూ ఉంటుందని స్థానికులు అంచనా వేస్తున్నారు. అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన సత్తియ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

గోదావరి ఒడ్డున మహిళ మృతదేహం



గుర్తుతెలియని మహిళ మృతదేహం

తాళ్లపూడి: మండలంలోని తాళ్లపూడిలోని టాక్సీ స్టాండ్ సమీపంలో పాత లాంచీల రేవు వద్ద గుర్తు తెలియని మహిళ మృత దేహం ఒడ్డుకు కొట్టుకొచ్చింది. స్థానికుల సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. తాళ్లపూడి ఎస్సై టి.శ్యామ్ సుందర్ తెలిపిన వివరాల ప్రకారం మహిళ ఎక్కడి నుంచి వచ్చిందో తెలియదు. ఆమె ఎరుపు అంచు, ఆకుపచ్చ రంగు చీర కట్టుకుని, ఎరుపు రంగు శరీర ఛాయ కలిగి ఉంది. 50 సంవత్సరాలు వరకు ఉంటాయి. మహిళ వివరాలు ఎవరికైనా తెలిస్తే తాళ్లపూడి పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

వేసవి దుక్కు.. లాభాలు పెక్కు

- రైతులను ప్రోత్సహిస్తున్న వ్యవసాయాధికారులు
- భూసారం వృద్ధి చెందుతుందని సూచన



కాజులూరులో ట్రాక్టర్‌తో వేసవి దుక్కు దున్నుతున్న రైతు

కాజులూరు: వ్యవసాయంలో ఒక పక్క అందుబాటులోకి వస్తున్న అధునాతన పద్ధతులను రైతులు పరిగణలోకి తీసుకుంటూనే మరోపక్క మేలైన సంప్రదాయ పద్ధతులను అవలంబిస్తున్నారు. గతంలో వ్యవసాయ రంగంలో యంత్రాల వాడకం అంతగాలేని సమయంలో రైతులు ఎడ్లకు నాగలికట్టి దాళ్వా మాసూళ్లు చేసి, కొన్ని రోజుల తర్వాత వేసవిలో మెట్ట దుక్కు చేసేవారు. వర్షాలు పడి కాలువ నీరు పుష్కలంగా పొలాలకు చేరిన అనంతరం మరోమారు దుక్కులు దున్నేవారు. ఆపై ట్రాక్టర్లు అందుబాటులోకి రావటంతో రైతులు పొలాల్లోకి నీరు వచ్చిన తర్వాత వెంట, వెంటనే దమ్ములు నిర్వహిస్తూ వస్తున్నారు. అయితే ప్రస్తుత తరుణంలోనూ వేసవి దుక్కులు మేలైనవని, నారుమడులు వేసి పొలాల్లో తొలకరి దమ్ములు చేసేందుకు ఇంకా సమయం ఉన్నందున రైతులు తమ పొలాల్లో వేసవి దుక్కులు చేపట్టాలని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. రబీ పంట మాసూళ్ల అనంతరం వేసవి దుక్కులు (మెట్ట దమ్ములు)కు రైతులు ప్రాధాన్యమివ్వాలని సూచిస్తున్నారు. ప్రస్తుతం డెల్టాలోని దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ రైతులు రబీ మాసూళ్ల పనులు పూర్తిచేసుకుని ఉన్నారు. అక్కడక్కడా కొందరు రైతులు అపరాలు సాగు చేసుకోగా అధికశాతం రైతులు పొలాలను ఆరగట్టి ఉంచారు. ఈ పొలాల్లో తప్పనిసరిగా వేసవిదుక్కులు చేసుకోవాలని కాజులూరు మండల వ్యవసాయాధికారి వి.అశోక్ సూచిస్తున్నారు.

నికర ఆదాయం పెరుగుతుంది



వేసవి దుక్కులతో కలుపు, కేళీలు నిర్మూలించవచ్చు. భూసారం వృద్ధి చెందుతుంది. ట్రాక్టరుకు నాగలికొట్టు కట్టి ఆరు అంగుళాల నుంచి అడుగు లోతు వరకూ దుక్కుదున్నటం ద్వారా పొలంలోని మట్టి తిరగబడుతుంది. దీంతో దాళ్వా వరి పంట నుంచి భూమిలోకి చేరిన క్రిమి, కీటకాలు, పురుగుల గుడ్లు బయటకు వచ్చి ఎండవేడికి నశించిపోతాయి. నేల గుల్లబడి మొక్క వేరువ్యవస్థ బలంగా ఉంటుంది. దాళ్వా మాసూళ్ల అనంతరం పొలంలో ఉండిపోయిన గడ్డి మట్టిలో కలిసి చీకిపోయి సేంద్రియ ఎరువులా మారుతుంది. ఎరువులు, పురుగుమందులు ఖర్చులు తగ్గి నికర ఆదాయం పెరుగుతుంది.

– వి.అశోక్, మండల వ్యవసాయాధికారి, కాజులూరు

పాత వీరంపాలెంలో టీడీపీ శ్రేణుల దాష్టీకం



వైఎస్సార్ సీపీ కన్వీనర్ వెంకటేశ్వరరావు ఇంటి వద్ద దాడికి యత్నిస్తున్న టీడీపీ శ్రేణులను అడ్డుకుంటున్న స్థానికులు



పాత వీరంపాలెంలో వైఎస్సార్ సీపీ శిలాఫలకం సిమెంట్ దిమ్మను కూల్చివేసిన టీడీపీ కార్యకర్తలు

- విజయోత్సవ ర్యాలీలో వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ ఇంటి వద్ద కవ్వింపు చర్యలు
- స్థానికుల చొరవతో వెనక్కు తగ్గిన వైనం
- వైఎస్సార్ సీపీ శిలాఫలకం కూల్చివేత

రంగంపేట: ఎన్నికల్లో విజయం సాధించిన సందర్భంగా టీడీపీ కార్యకర్తలు మంగళవారం రంగంపేట మండలం పాత వీరంపాలెంలో చేసిన దాష్టీకం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను గురువారం స్థానిక వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ గండి వెంకటేశ్వరరావు వెల్లడించారు. టీడీపీ కార్యకర్తలు గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తూ తమ ఇంటి వద్దకు వచ్చి కవ్వింపు చర్యలు చేపట్టారన్నారు. ఇంటి గేటు వద్ద బాణసంచా కాల్చుతూ దాడికి యత్నించారన్నారు. అనంతరం తాను, చుట్టు పక్కలవారు కల్పించుకోవడంతో పరారయ్యారన్నారు. మళ్లీ రాత్రి 8 గంటల ప్రాంతంలో తమ ఇంటికి డీజే సౌండ్ బాక్సులతో వచ్చి పెద్ద ఎత్తున సౌండ్స్ పెట్టి, బాణసంచా కాల్చారని చెప్పారు. ఎంత సేపటికీ అక్కడి నుంచి వెళ్లకపోవవడంతో చుట్టుపక్కల వారు ప్రశ్నించడంతో ముగ్గురు వ్యక్తులపై దాడి చేసి గాయపరిచారని తెలిపారు. వీధి చివరలో ఉన్న వైఎస్సార్ సీపీ శిలా ఫలకం దిమ్మను కూల్చివేశారని చెప్పారు. దీనిపై రంగంపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు వెంకటేశ్వరరావు తెలిపారు.

టీడీపీ నుంచి ప్రాణరక్షణ కల్పించాలి



విలేకరులతో మాట్లాడుతున్న బాధితుడు, కుటుంబ సభ్యులు

బాధితుడి కుటుంబ సభ్యుల ఆవేదన

రాజమహేంద్రవరం సిటీ: తెలుగుదేశం పార్టీకి చెందిన కొందరు తమపై దాడి చేశారని, మా కుటుంబానికి ప్రాణహాని ఉంది.. రక్షణ కల్పించాలని స్థానిక 40వ డివిజన్ కోటిలింగాలపేట అర్థి వీధికి చెందిన పాలిక వెంకటసాయి దుర్గ కోరారు. గురువారం ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలలో వైఎస్సార్ సీపీ తరపున చురుకుగా ప్రచారం చేశానని కక్ష పెంచుకొని అదే ప్రాంతానికి చెందిన కొల్లి నాని, సింహ బాల, కొల్లి శివలు జూన్ 4వ తేదీన కోటిలింగాలపేట అడితి వద్ద తనపై రాడ్‌తో దాడి చేశారని చెప్పాడు. ఈ దాడి అనంతరం గాయాలతో వెళ్లి త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందినట్టు చెప్పారు. బాధితుడి తల్లి పాలిక పార్వతి, తండ్రి సత్యనారాయణ సోదరి రామలక్ష్మి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి చెందిన కొల్లి నాని, సింహ బాల, కొల్లి శివల నుంచి మా కుటుంబానికి ప్రాణ రక్షణ కల్పించాలని కోరారు. ఎన్నికలలో వైఎస్సార్ సీపీ తరపున ప్రచారం చేసినందుకు కక్ష పెంచుకొని ఈ ముగ్గురు తమ కుమారుడు పై రాడ్డుతో దాడి చేసి చంపేస్తామని బెదిరించారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ఎమ్మెల్సీ రిపోర్టు రాకుండానే పోలీసులు తూతూ మంత్రంగా కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. ఈ సంఘటనలో దాడికి పాల్పడిన నిందితులను అరెస్టు చేసి తమకు న్యాయం చేయాలని కోరారు.

నిన్న పగులగొట్టారు–నేడు తగులబెట్టారు



సర్వీసింగ్ సెంటర్‌ను తగులబెట్టిన టీడీపీ కార్యకర్తలు

నల్లజర్ల: మండలంలోని గంటావారిగూడెంలో గురువారం టీడీపీ కార్యకర్తలు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో వైఎస్సార్ సీపీ కార్యకర్త ఈబిచర్ల ప్రభాకరావుకు చెందిన వాటర్ సర్వీసింగ్ మంగళవారం ఇదే సర్వీసింగ్ సెంటర్‌ను టీడీపీ కార్యకర్తలు టార్గెట్ చేసి ధ్వంసం చేశారు. మళ్లీ రెండురోజుల అనంతరం పెట్రోల్ పోసి తగులబెట్టడం వెనుక టీడీపీ నాయకుల హస్తం ఉందని ఆ గ్రామ వైఎస్సార్ సీపీ దళిత నాయకుడు తోట వెంకట్రావు తెలిపారు.

జైభీమ్ స్థూపం కూల్చివేతపై రెండు కేసుల నమోదు

అమలాపురం టౌన్: అమలాపురం రూరల్ మండలం పేరూరు శివారు చింతపల్లి వారిపేటలో ఇద్దరు జన సైనికులు జై భీమ్ స్థూపాన్ని మోటారు సైకిల్‌తో ఢీకొట్టి కూల్చివేసిన ఘటనపై పట్టణ పోలీసులు రెండు కేసులు నమోదు చేశారు. ఈ నెల 4వ తేదీన చోటుచేసుకున్న ఘటనను నిరసిస్తూ ఆ పేటకు చెందిన కొందరు ఆందోళనకు దిగి పోలీసులు పట్ల దురుసుగా ప్రవర్తించారు. స్థూపం కూల్చివేసిన జనసేన కార్యకర్తలు మణికంఠ, రవికుమార్‌లను అరెస్ట్ చేయాలని ఆందోళనకారులు డిమాండ్ చేస్తూ ఆ రోజు నిరసన వ్యక్తం చేశారు. ఘటనా స్థలంలో డీఎస్పీ ఎం.మహేశ్వరరావు, పట్టణ సీఐ కె.క్రిష్టోఫర్‌లు పోలీసు సిబ్బందితో ఆ రోజు రాత్రి పది గంటల వరకూ ఆందోళనకారులతో చర్చించారు. ఈ ఘటనకు కారకులైన మణికంత, రవికుమార్‌లపై కేసు నమోదు చేశామని సీఐ క్రిష్టోఫర్ తెలిపారు. పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించిన వారిపై కూడా కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

రేపటి నుంచి రాష్ట్ర స్థాయి టీటీ టోర్నీ

పెద్దాపురం: స్థానిక శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాలలో రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ ర్యాకింగ్ పోటీలు శనివారం నుంచి నిర్వహించనున్నట్టు పాఠశాల డైరెక్టర్ సీహెచ్.విజయ్ ప్రకాష్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లకు ఓ ప్రకటన విడుదల చేస్తూ 8,9,10 తేదీల్లో మూడు రోజుల పాటు పోటీలు ఉంటాయన్నారు. ఏపీ టీటీఏలో నమోదయిన క్రీడాకారులు మాత్రమే ఈ ర్యాకింగ్ పోటీలకు అర్హులన్నారు. ఈ పోటీలు మెన్, వుమెన్, బాలుర విభాగాల్లో అండర్–19, అండర్–17, అండర్–15 అండర్–13, అండర్–11తో పాటు మహిళ, బాలికల విభాగంలో అండర్–19, అండర్–17, అండర్–15 అండర్–13, అండర్–11. డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో జరుగుతాయని విజయ్ ప్రకాష్, టీటీ అకాడమి వైస్ ప్రెసిడెంట్ వి.భాస్కరరామ్ తెలిపారు.

బిల్లు కలెక్టర్‌పై గుర్తు తెలియని వ్యక్తుల దాడి

కాకినాడ రూరల్: మండలంలోని సర్పవరం గ్రామంలో సచివాలయం – 1పై గురువారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. కుర్చీలు బద్దలు కొట్టి బిల్లు కలెక్టర్ శేషుగోపాల్ చెంపపై కొట్టి దౌర్జన్యానికి పాల్పడ్డారు. సంఘటన జరిగిన సమయంలో తాను లోపల తన గదిలో ఉన్నానని పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. బైక్‌లపై ఐదుగురు వచ్చి ఇద్దరు బయట ఉండగా ముగ్గురు లోపలికి వచ్చినట్టు ఆయన తెలిపారు. ముగ్గురిలో ఒకరు సెల్‌తో వీడియో తీస్తుండగా మరో వ్యక్తి బిల్లు కలెక్టర్‌పై దాడికి పాల్పడ్డాడని, భయపడి తన రూమ్ వద్దకు బిల్లు కలెక్టర్, సచివాలయ మహిళ సిబ్బంది వచ్చారన్నారు. నేను వారిని ప్రశ్నించడంతో కుర్చీలు బద్దలు కొట్టి కర్రతో మళ్లీ బిల్లు కలెక్టరుపై దాడికి ప్రయత్నించినట్టు తెలిపారు. మీ అంతు చూస్తామని చెప్పి పోయారని, దీనిపై సర్పవరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నట్టు సర్పవరం స్టేషన్ రైటర్ నాగేశ్వరరావు తెలిపారు. ఈ ఘటనను సర్పవరం వైఎస్సార్ సీపీ నాయకుడు పుల్ల చందు ఖండించారు.

సెబ్‌కు నాలుగు అత్యుత్తమ పురస్కారాలు



ఏపీ సెబ్ కమిషనర్ రవిప్రకాష్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్న సెబ్ జిల్లా ఆఫీసర్ పిట్టా సోమశేఖర్, ఇన్‌స్పెక్టర్‌లు హనుశ్రీ, పీవీ రమణ, వెంకటలక్ష్మి

రాజమహేంద్రవరం రూరల్: తూర్పుగోదావరి జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్)కు రాష్ట్రంలో వివిధ కేటగిరీలలో నాలుగు అత్యుత్తమ పురస్కారాలు లభించాయి. గురువారం అమరావతిలో ఏపీ రాష్ట్ర స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కమిషనర్ రవిప్రకాష్ 2023 సంవత్సరంలో అత్యుత్తమ సేవలు అందించినందుకు జిల్లా సెబ్‌కు వివిధ కేటగిరీల్లో నాలుగు పురస్కారాలను అందించారు. సంబంధిత అధికారులకు ట్రోఫీలను బహూకరించారు. రాష్ట్రంలో తూర్పు గోదావరిజిల్లా సెబ్ ఉత్తమజిల్లాగా ఎంపిక కావడంతో సెబ్ జిల్లా అధికారి పిట్టా సోమశేఖర్ కమిషనర్ రవిప్రకాష్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. రాష్ట్రంలో అత్యుత్తమ దర్యాప్తు అధికారిగా రాజమహేంద్రవరం సెబ్ సౌత్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పులి హనుశ్రీ, ఉత్తమ మహిళా ఆఫీసర్‌గా అప్పటి రంగంపేట సెబ్ ఇన్‌స్పెక్టర్ వెంకటలక్ష్మి, అన్ని విభాగాల్లో ఉత్తమ సేవలు అందించినందుకు రన్నరప్‌గా నిలిచిన రాజమహేంద్రవరం నార్త్ స్టేషన్‌కు అప్పటి ఇన్‌స్పెక్టర్ పీవీరమణలకు కమిషనర్ రవిప్రకాష్ చేతులమీదుగా అవార్డులు అందుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి

కుమారుడికి గాయాలు



రాజ్‌కుమార్ మృతదేహం

కాకినాడ రూరల్: కాకినాడలో గుదారిగుంట లక్ష్మీ ఆస్పత్రి సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటారు సైకిల్‌పై ప్రయాణిస్తున్న తండ్రి కొడుకుల్లో తండ్రి అక్కడికక్కడే మృతి చెందగా, రెండు కాళ్ళకు తీవ్ర గాయాలతో కొడుకు ఆస్పత్రిలో చేరారు. సర్పవరం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ప్రమాదంలో జగ్గంపేట మండలం రాజపూడి గ్రామానికి చెందిన గవిడి రాజ్‌కుమార్(45)మృతి చెందాడు. రాజ్‌కుమార్, కొడుకు ప్రవీణ్ కలిసి మోటారు సైకిల్‌పై ఆర్టీఓ కార్యాలయం రోడ్డు మీదుగా డైరీ ఫారం సెంటరుకు వెళుతుండగా మార్గంలో డివైడర్‌ను ఢీకొట్టారు. దీంతో బైక్ నడుపుతున్న రాజ్‌కుమార్ రోడ్డుపై పడిపోవడంతో తలకు బలమైన గాయంతో తీవ్ర రక్త స్రావమవ్వగా అక్కడికక్కడే మృతి చెందాడు. కొడుకు ప్రవీణ్ రెండు కాళ్లకు గాయాలవ్వడంతో జీజీహెచ్‌కు తరలించారు. అతను క్షేమంగా ఉన్నట్టు పోలీసులు తెలిపారు. మృతుడు సోదరుడు జిన్నిబాబు ఫిర్యాదు మేరకు ఏఎస్సై ఎం.నాగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు.